సాక్షి నంద్యాల

శనివారం । 11 । మే । 2024



శాస్త్రోక్తంగా ఊయల సేవ

ఆత్మకూరు: లోక కల్యాణార్థం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులకు శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా ఊయల సేవను నిర్వహించారు.



సువర్ణ పుష్పార్చన

మహానంది: అక్షయ తృతీయ సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం బంగారు పుష్పాలతో అర్చన చేపట్టారు.



ఘనంగా బసవ జయంతి

హొళగుంద: బసవ జయంతి వేడుకలను వీరశైవ లింగాయిత్‌లు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బసవేశ్వరస్వామికి పూజలు నిర్వహించి ఎద్దులను పుర వీధుల్లో ఊరేగించారు.

న్యూస్‌రీల్

మాతా శిశు మరణాలను తగ్గించాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకపల్లి రాజు తదితరులు

నంద్యాల టౌన్: గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మాతాశిశు మరణాలను తగ్గించాలని స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకపల్లి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంసీహెచ్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆశా నోడల్ ఆఫీసర్లకు, కార్యకర్తలకు కిల్కారి కోర్స్ గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లంకపల్లి రాజు మాట్లాడుతూ కిల్కారి కోర్సు ప్రతి ఆశా కార్యకర్త తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేస్తామన్నారు. ఈ కోర్సులో గర్భధారణ సమయం నుంచి ప్రసవం అయ్యేవరకు గర్భిణిలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, బాలింతలు, నవజాత శిశువులకు ఎటువంటి చికిత్సను అందించాలి అనే విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ గర్భిణికి నాల్గవ నెల నుంచి ప్రసవం అయ్యేవరకు నమోదు చేసుకున్న ఫోన్‌కు.. 01244451660 నెంబర్ నుంచి కాల్ వస్తుందన్నారు.ఆటోమేటిక్ వాయిస్ విధానంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ ఫోన్ కాల్ ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం కిల్కారి కోర్సుకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం రీజనల్ కోఆర్డినేటర్ కీర్తి, డీఐఓ ప్రసన్నలక్ష్మీ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయి, డీసీహెచ్ ఎస్ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ కాంతారావు నాయక్, జగదీష్ చంద్ర రెడ్డి, డాక్టర్ సునీత, డీపీవో నజ్నీన్, ఎస్‌ఓ సుజాత, చిన్న వీరన్న పాల్గొన్నారు.

మండు వేసవిలో జలకళ



డబ్ల్యూ గోవిందిన్నె కుందరవాగులో వర్షపు నీరు

దొర్నిపాడు: ఎనిమిది నెలలుగా చినుకు జాడ లేక ఎండిన పొలాల్లో ప్రస్తుతం కురిసిన వర్షానికి జలకళ సంతరించుకున్నాయి. రెండు రోజులుగా మండలంలో ఓ మోస్తరు వాన పడటంతో వాగులు ప్రవహించాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊరట చెందుతున్నారు.

16 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): నిన్న, మొన్నటి వరకు ఎండలు, వడగాడ్పులతో ఉడికిన జిల్లాపై వరుణుడు కరుణించాడు. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిపించి ప్రజలకు చల్లదనాన్ని పంచుతున్నాడు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 16 మండలాల్లో వర్షాలు కురిశాయి. ఒకటి, రెండు మండలాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఆలూరులో 88, కోడుమూరులో 60.2, కృష్ణగిరిలో 29, కొతాళంలో 28.6 గూడూరులో 18.6 వెల్దుర్తిలో 18.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 12 మి.మీ వర్షం కురిసింది. శుక్రవారం అత్యధికంగా హొళగుందలో మండలంలో 39.9, నందికొట్కూరులో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు, పెనుగాలుల వల్ల విద్యుత్ శాఖకు రూ.1.57 కోట్ల మేర నష్టం జరిగింది. మొత్తం 565 పోల్స్, 30.6 కిలోమీటర్ల లైన్ పెనుగాలుల తీవ్రతకు దెబ్బతినింది. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జన కెరటం



ప్రసంగిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు బుడ్డా శేషారెడ్డి, అహ్మద్‌హుసేన్, హబీబుల్లా తదితరులు

ఆత్మకూరులో అభిమానం ఉప్పొంగి జన కెరటం ఎగిసింది. గౌడ్ సెంటర్ జనసంద్రమైంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆత్మకూరులో నిర్వహించిన రోడ్ షోకు జనం తరలివచ్చారు. మీవెంటే మేమంతా అంటూ మద్దతు పలికారు. సంక్షేమం, అభివృద్ధికే పట్టం కడతామని చాటి చెప్పారు.

– ఆత్మకూరు



జనసంద్రమైన ఆత్మకూరులోని గౌడ్ సెంటర్

ఇక 'నోటు'మాట

ఎన్నికల ప్రచారానికి నేడు ఆఖరు

- సాయంత్రం 6 గంటలకు మూగబోనున్న మైకులు
- 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం విక్రయాలు బంద్
- జిల్లాలో మొదలైన ప్రలోభాల పర్వం
- డబ్బు పంపిణీపై దృష్టిసారించిన అభ్యర్థులు
- జిల్లాలో ఖరీదైన ఎన్నికలుగా బనగానపల్లె, ఆళ్లగడ్డ
- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు
- శాంతిభద్రతలను కట్టుదిట్టం చేసిన పోలీసులు

సాక్షి, నంద్యాల: సార్వత్రిక సంగ్రామంలో కీలక ఘట్టం ముగియనుంది. నేటి సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ గడువు నుంచి పోలింగ్ ముగిసేదాకా 13వ తేదీ 7 గంటల వరకు 48 గంటల పాటు మద్యం విక్రయాలు బంద్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, పోలీసులు రేపే వారికి కేటాయించిన పోలింగ్ సెంటర్లకు చేరుకోనున్నారు. ఎల్లుండి ఉదయం 7గంటల నుంచే పోలింగ్ మొదలుకానుంది. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఎస్పీ రఘువీర్‌రెడ్డి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో అదనపు భద్రతా దళాలను మోహరించనున్నారు. మార్చి 16న ఎన్నికల షెడ్యూలు వెలువడిన రోజు నుంచి ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలన్నీ హోరాహోరీగా ప్రచారాన్ని సాగించాయి. ఆయా



పార్టీల అధినేతలను ప్రచారానికి రప్పించాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో బస్సుయాత్ర నిర్వహించారు. అంతకు ముందు నంద్యాల మేమంతా సిద్ధం సభలో పాల్గొనడంతో లక్షలాది మంది జనం తరలివచ్చారు. మరోవైపు తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నందికొట్కూరు, డోన్, పాణ్యంలో ప్రచారం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలకు ప్రజలు భారీగా పోటెత్తారు. రెండుపార్టీల అధినేతల ప్రచారానికి తరలివచ్చిన జనాన్ని చూస్తే జిల్లాలో రాజకీయ వాతావరణం ఎలా ఉందో స్పష్టమవుతోంది. ఇప్ప


టికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓట్లు వేశారు. పోలింగ్ మే 13న నిర్వహిస్తుండగా, జూన్ 4వ తేదీ కౌంటింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే ప్రధాన పోటీ..

58రోజుల ప్రచారశైలిని పరిశీలిస్తే జిల్లాలోని ఒక ఎంపీ స్థానంతో పాటు 6 అసెంబ్లీల్లో వైఎస్సార్‌సీపీ, టీడీడీ మధ్యే ప్రధాన పోటీ ఉందని స్పష్టమవుతోంది. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐతో పాటు ఇతర పార్టీలు నామమాత్రపు పోటీ ఇవ్వనున్నాయి. జిల్లాలో నంద్యాల ఎంపీ స్థానానికి సంబంధించి 31 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆళ్లగడ్డలో 18 మంది, బనగానపల్లెలో 28 మంది, డోన్ 16 మంది, నందికొట్కూరు 18 మంది, నంద్యాల 28 మంది, శ్రీశైలం 18 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నంద్యాల పార్లమెంట్ స్థానానికి సంబంధించి ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మధ్య నెలకొంది. అలాగే నంద్యాల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్.. ఆళ్లగడ్డలో గంగుల బిజేంద్రారెడ్డి(నాని), భూమా అఖిలప్రియ.. శ్రీశైలంలో శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి.. డోన్‌లో బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బనగానపల్లెలో కాటసాని రామిరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, నందికొట్కూరులో డాక్టర్ దారా సుధీర్, గిత్తా జయసూర్య మధ్య పోటీ నెలకొంది.

48 గంటలు మద్యం విక్రయాలు బంద్

ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు



జిల్లాలో మద్యం విక్రయాలు నిలిపేస్తూ ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రాతినిధ్యచట్టం సెక్షన్ 135–సి ప్రకారం 'డ్రైడే' పాటించాలి. డ్రైడే పాటించని మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తప్పవు. అలాగే ఓట్ల లెక్కింపు రోజు కూడా మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుంది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొన్ని పార్టీల అభ్యర్థులు ముందుగానే అవసరమైన మద్యం నిల్వలను కొనుగోలు చేశారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

పోలింగ్ ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసినట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ప్రకటించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది రేపు వారికి కేటాయించిన రూట్లలో పోలింగ్ సెంటర్లకు చేరుకోనున్నారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రత్యేక వాహనాలు సిద్ధం చేసుకున్నారు. ఈవీఎంలు, ఇతర సామగ్రి అన్నీ కట్టుదిట్టమైన భద్రత మధ్య వెళ్లనున్నాయి. మరోవైపు శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఎస్పీ రఘువీర్‌రెడ్డి గట్టి భద్రతా ఏర్పాట్లు తీసుకున్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలతో పాటు సున్నిత, అతిసున్నిత గ్రామాల్లో పోలీసులు పల్లె నిద్ర కూడా చేశారు.

డబ్బు పంపిణీపై దృష్టి పెట్టిన అభ్యర్థులు

- నంద్యాల జిల్లాలో ఏ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చును పరిగణలోకి తీసుకున్నా జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని ఖరీదైన ఎన్నికలు జరుగుతున్నాయి.
- ప్రచార ఘట్టం ముగుస్తుండటంతో నేతలంతా డబ్బు పంపిణీపై దృష్టి పెట్టారు.
- టీడీపీ అభ్యర్థులు ఇప్పటికే డబ్బు పంపిణీ ప్రారంభించారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు ఖర్చు చేస్తున్నాయి.
- ఓటర్లకు డబ్బు పంపిణీ అంశంలో టీడీపీ విచ్చలవిడిగా ఖర్చు చేస్తోంది. ఓటుకు సగటున రూ.2వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు.
- బనగానపల్లిలో ఓటుకు రూ.2వేల చొప్పున టీడీపీ నేతలు పంపిణీ చేశారు. మరో వెయ్యి కూడా పంచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.
- ఆళ్లగడ్డ, నంద్యాల ప్రాంతాల్లో ఓటుకు రూ.వెయ్యి, మరికొన్ని ప్రాంతాల్లో రూ.2వేలు పంపిణీ చేస్తున్నారు.
- తక్కిన నియోజకవర్గాల్లో రూ.వెయ్యికి తక్కువ లేకుండా మొత్తం ఓట్లలో 70–80శాతం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.

అభివృద్ధి అంటే పేకాట కాదు

- కేంద్రమంత్రిగా కోట్ల చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలి
- మంచి చేసిన వారెవరో..ముంచేసిన వారెవరో ప్రజలకు తెలుసు
- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన

ప్యాపిలి: అభివృద్ధి అంటే పేకాట ఆడుతూ కాలక్షేపం చేయడం కాదని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డికి చురకలు అంటించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ప్యాపిలి, జలదుర్గంలో పర్యటించారు. రోడ్‌షోలో భాగంగా ప్యాపిలి కొత్త బస్టాండ్‌వద్ద బుగ్గన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడారు. కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని మంత్రి విమర్శించారు. ఆర్థికశాఖ మంత్రి నియోజకవర్గంలో అందుబాటులో ఉండరని కోట్ల విమర్శించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాభివృద్ధి, నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో మంత్రులు ఎక్కడ ఉంటారో కూడా తెలియని స్థితిలో కోట్ల ఉన్నారని మంత్రి విమర్శించారు. గతంలో కేంద్రమంత్రిగా పని చేసిన కోట్ల అప్పట్లో తన సొంత గ్రామంలో పేకాట ఆడుతూ కాలక్షేపం చేసి దాన్నే అభివృద్ధిగా భావించినట్లున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన సమయంలో చీకటి ఒప్పందంలో భాగంగా కేంద్రమంత్రి పదవిని పొందిన కోట్లకు అభివృద్ధి గురించి ఎలా తెలుస్తుందని మంత్రి విమర్శించారు. డోన్ నియోజకవర్గానికి మంచి



ప్యాపిలిలో సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన

చేసినదెవరో..ముంచేసిన వారెవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. డోన్‌లో 135 అభివృద్ధి పనులు, 35 భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి మోడల్ నియోజకవర్గంలా తీర్చిదిద్దానని మంత్రి తెలిపారు. అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నిస్తున్న కోట్ల చదువుకుంటానంటే నియోజకవర్గ అభివృద్ధి పుస్తకాన్ని పంపిస్తానని, లేదంటే ఎన్నికలు ముగిశాక కోట్ల తనతో వస్తే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపిస్తానని మంత్రి అన్నారు. ప్యాపిలి మండలంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ చెవిటి లక్ష్మీదేవి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము పాల్గొన్నారు.

టీడీపీ చీప్ ట్రిక్స్

బరితెగిస్తున్న పచ్చ బ్యాచ్

- టీడీపీ నేతలను వెంటాడుతున్న ఓటమి భయం
- ప్రశాంతమైన పల్లెల్లో అగ్గి రాజేస్తున్న నాయకులు
- ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా దాడులు
- తమకు ఓటేయకుంటే అంతు చూస్తానని బుడ్డా బెదిరింపు
- బనగానపల్లెలో బీసీ అనుచరుల రౌడీయిజం
- కొత్తపల్లెలో భూమా అఖిల ప్రియ అనుచరుల దాదాగిరి



సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఘడియలు సమీపిస్తుండటంతో టీడీపీ నేతలు బరితెగింపునకు పాల్పడుతున్నారు. ఓటర్లను బెదిరించడం, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి నంద్యాల జిల్లా కంచుకోటగా నిలుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి జిల్లా ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్నారు. 2014 ఎన్నికల్లో బనగానపల్లె మినహా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఎంపీ స్థానాన్ని పార్టీ కైవసం చేసుకుంది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని భారీ మెజారిటీతో సొంతం చేసుకుంది. గత ఎన్నికల ఫలితాలే మరి కొద్ది గంటల్లో జరగనున్న పోలింగ్‌లో పునరావృతమవుతాయని టీడీపీ భావిస్తోంది. అమలుకానీ, అబద్ధపు హామీలు ఎన్ని చెబుతున్నా.. తమను ప్రజలు విశ్వసించడం లేకపోవడంతో ఓటమి భయం వారిని వెంటాడుతోంది. ఓటర్లను నేరుగానే బెదిరిస్తున్నారు. పది రోజుల క్రితం శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి బండిఆత్మకూరు మండలం సోమయాజుల పల్లె ప్రచారం చేస్తూ ఓటర్లను బెదిరించారు. '13వ తేదీ అయిపోయాక మీ పని చెప్తా.. ఎవడు అడ్డు వస్తాడో చూస్తా' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రశాంతమైన పల్లెల్లో అగ్గి రాజేసేందుకు బుడ్డా ప్రయత్నిస్తున్నారు.

బీసీ అనుచరుల రౌడీయిజం

ఫ్యాక్షన్ ప్రాంతమైన బనగానపల్లె గత ఐదేళ్లగా ప్రశాంతంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవెలకుంట్ల, బనగానపల్లెలో ప్రధాన రోడ్ల విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మంచి మైలేజీ వచ్చింది. అలాగే సుమారు రూ.23 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో బనగానపల్లె పట్టణం నడిబొడ్డున 100 పడకల ఆస్పత్రి నిర్మించి ప్రారంభించడంతో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తున్నారు. దీన్ని ఓర్చుకోలేని టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి తన అనుచరులను ఉసిగొల్పుతున్నారు. డబ్బు ఆశ చూపి దాడులు చేయమని ప్రోత్సహిస్తున్నారు. బీసీ అండతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయి. రెండు రోజుల క్రితం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేశారు. తమకు ఓటు వేయకుంటే దాడులు చేస్తామని సాధారణ ప్రజలను బెదిరింపులకు పాల్పడుతున్నారు. అలాగే డబ్బులు పుష్కలంగా ఉండడంతో ఓటుకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు కూడా ఖర్చు చేయాలని బీసీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ప్రశాంత పల్లెలో ఉద్రిక్తతలే లక్ష్యంగా....

రాష్ట్రంలోనే ఆళ్లగడ్డ నియోజకవర్గం అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా నిలిచింది. గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ.. ఈ ఎన్నికల్లో ఉనికిని కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలను అఖిలప్రియ అనుచరులు బెదిరించారు. 'మా గ్రామంలో ప్రచారం చేసేంత ధైర్యం వచ్చిందా' అంటూ భూమా అఖిల అనుచరులు వైఎస్సార్‌సీపీ నాయకుడైన భూమా వీరభద్రారెడ్డిపై మూకుమ్మడి దాడికి తెగబడ్డారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా తమకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీకే అండగా నిలుస్తామని జిల్లా ప్రజలు చెబుతున్నారు.

ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట చర్యలు

- 1,350 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్
- 403 పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అత్యంత పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో సాధారణ ఎన్నికల పోలింగ్ తదితర అంశాలపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలసి కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు చివరి 72 గంటలు అత్యంత కీలకమైనవని, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న మూడు రోజులు అత్యంత కీలకమైనవని, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పూర్తి అప్రమత్తతతో మెలగాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

లో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతున్న నేపథ్యంలో అదనపు బ్యాలెట్ యూనిట్లు తెప్పించి అన్ని నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. ఈనెల 12వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. జిల్లాలో 1,350 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 335 లొకేషన్లలోని 403 పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా స్లిప్పులు పంపిణీ చేయిస్తున్నామన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ రోజున ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా షామియానాలు వేయడం తోపాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి లొకేషన్‌లో వికలాంగుల సౌకర్యార్థం వీల్ చైర్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటలు ముందు నుంచి డ్రై డే ఉంటుందన్నారు.

- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దుల్లోని 8 అంతర్గత చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ ఓటరు తప్ప ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉంటే బయటికి పంపించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. అలాగే మ్యారేజ్ ఫంక్షన్ హాల్, కమ్యూనిటీ హాల్, లాడ్జీలు వంటి వాటిని కూడా ట్యాప్ చేయడం జరిగిందని, ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు? తదితరాలన్నింటిని పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల సంబంధిత అధికారులు తప్ప పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల ఎవరూ ప్రవేశించడానికి వీలులేదన్నారు. ఎన్నికల బందోబస్తుకు 4 కంపెనీల పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలు కూడా రానున్నాయన్నారు.



పత్తికొండలో రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ప్యాపిలి: ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని మిలటరీ కాలనీ రోడ్డు వద్ద నిర్వహించిన సభకు హాజరైన మహిళలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక



చాగలమర్రి: ఎం. తండాలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రోడ్‌షోలో పాల్గొన్న గిరిజనులు



దేవనకొండ: తెర్నేకల్ గ్రామంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి, చిత్రంలో తెర్నేకల్ సురేందర్‌రెడ్డి



మిడుతూరు: సుంకేసుల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, చిత్రంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



ప్రచార పర్వం

ఊరూవాడా.. జన ఉప్పెన

పోలింగ్ సమయం దగ్గర పడటంతో అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో, పల్లెల్లో రోడ్‌షోలతోపాటు బహిరంగ సభలు జరుపుతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ప్రజలు ఉప్పెనలా తరలివస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరిస్తూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటు అభ్యర్థిస్తున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. -సాక్షినెట్‌వర్క్



అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు(ఇన్‌సెట్) రోడ్‌షోలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కల్లూరు: చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్ నగర్ వరకు ర్యాలీలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



గూడూరు: రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌కు గజమాల వేస్తున్న అభిమానులు





ఆదోని రూరల్: పెద్దతుంబళం ఎన్నికల ప్రచారంలో భారీ జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ముంగిట్లోకే..ఉద్యోగ అవకాశాలు!

- యువత అభ్యున్నతికి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కృషి
- విస్తృతంగా జాబ్‌మేళాల నిర్వహణ
- ఐదేళ్లలో 13,385 మందికి ఉద్యోగాలు



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న యువతీ యువకులు



నైపుణ్య శిక్షణ ఇస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 13,385 మంది యువతీ, యువకులకు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని కార్పొరేట్, ఇతర కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిధులు కొల్లగొట్టారు. భారీగా నిధులు ఖర్చు చేసినా పదుల సంఖ్యలో ఉద్యోగాలు లభించిన దాఖలాలు లేవు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు స్కిల్స్ డెవలప్‌మెంటును సొంతం ఆదాయ వనరుగా వినియోగించుకుంటే... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువత అభ్యున్నతికి శ్రీకారంచుట్టారు. చంద్రబాబు స్కిల్స్‌పేరుతో దోనిడికి పాల్పడితే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు పెంచారు.

శిక్షణ.. ఉద్యోగం

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ఎనిమిది స్కిల్స్ హబ్‌లు ఏర్పాటు చేసింది. వాటిల్లో యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసి.. కార్పొరేట్ కంపెనీలు, ఇతర ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించింది. స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఐదేళ్లలో 6,791 మంది యువతకు ఉద్యోగాలు లభించడం విశేషం. ఒక్కో హబ్‌లో ఏడాది నాలుగు బ్యాచ్‌లను నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంటు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ జనరల్ తదితర వాటిల్లో నైపుణ్యాల అభివృద్ధి చేసుకున్నారు. కొందరు వృద్ధి చేసుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. మరి కొందరు పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారు దేశ వ్యాప్తంగా వివిధ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో రాణిస్తుండటం విశేషం. మెగా జాబ్ మేళా, మినీ జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను అందుబాటులో తీసుకు రావడం విశేషం.

స్కిల్ కాలేజీ ద్వారా 2,844 మందికి ఉద్యోగ అవకాశాలు...

డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా స్కిల్ కాలేజీ నడుస్తోంది. పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్కిల్ కాలేజీ ఏర్పాటయ్యాయి. డీఆర్‌డీఏ-వైకేపీకి సంబంధించి కర్నూలు స్కిల్ కాలేజీ, ఎమ్మిగనూరులో ట్రెనింగ్ సెంటరు నడుస్తున్నాయి. కర్నూలు శివారులోని టీటీడీసీలో రెసిడెన్షియల్ స్కిల్ కాలేజీ నిర్వహిస్తున్నారు.. స్కిల్ కాలేజీ, స్కిల్ ట్రెనింగ్ సెంటరు, వీటికి సంబంధించిన సంస్థల ద్వారా 2019-20 నుంచి 2023-24 వరకు 3,463 మందికి నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఇందులో 2,844 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. నిరుద్యోగ యువతకు మెడికల్‌కు సంబంధించి పేషెంట్ రిలేషన్ సర్వీస్ డ్యూటీ మేనేజర్, పేషెంట్ రిలేషన్ సర్వీస్ అసోసియేట్, సేల్స్ సూపర్‌వైజర్‌లుగా రాణించేందుకు వీలుగా స్కిల్స్‌ను వృద్ధి చేసుకునేందుకు శిక్షణ ఇస్తూ ప్లేస్‌మెంటు చూపుతుండటం విశేషం.

మెరుగు పడిన ఉద్యోగ అవకాశాలు...

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించారు. జాబ్ మేళా కార్యక్రమాలకు కంపెనీల ప్రతినిధులే వచ్చి అర్హత, నైపుణ్యాలు కలిగిన వారిని ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తుండటం విశేషం. జిల్లా ఉపాధి కల్పన సంస్థ నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమాలకు 382 కంపెనీలు హాజరయ్యాయి. ఉపాధి కల్పన సంస్థ ద్వారా ఉద్యోగాలకు 4,471 మంది ఎంపికైతే 3,750 ప్లేస్‌మెంటులు లభించాయి. జాబ్ మేళా ద్వారా అర్హులైన యువతను ఎంపిక చేసుకునేందుకు పెద్ద కంపెనీలు ముందుకు వస్తున్నాయి. రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనాలతో యువత పనిచేస్తోంది.

వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు

- న్యాయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఫ్లకార్డులతో ప్రదర్శన



న్యాయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఫ్లకార్డులతో మద్దతు ప్రకటిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చిన వైఎస్సార్‌సీపీకి రాయలసీమ ప్రజా సంఘాలు, ఉద్యమ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడకు వచ్చిన ఆర్‌యుఎఫ్ నేతలు నగర శివారుల్లోని జగన్నాథగట్టుపై నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఫ్లకార్డులతో తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించడం హర్షణీయమన్నారు. శ్రీ భాగ్ ఒప్పందంలో భాగంగా రాయలసీమ అభివృద్ధి గురించి దశాబ్దాలుగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నా, పాలకులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీమ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. ఒక లక్ష ఎకరాలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేయనున్న రాయలసీమ ఎత్తిపోతల పథకం ఏర్పాటు కాకుండా ప్రతిపక్ష నాయకులు కోర్టుల్లో వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. సీమ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీకి ప్రతి ఒక్కరూ మద్దతు ప్రకటించాలని కోరారు. రాయలసీమ ఆరు జిల్లాల్లో నీటి కొరత లేకుండా చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినవ శ్రీ కృష్ణదేవరాయలుగా అభివర్ణించారు. రాయలసీమ అభివృద్ధి సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణా రాఘవరెడ్డి, నాయకులు పుట్లూరు భాస్కర్‌రెడ్డి, నూర్ మహమ్మద్, యక్కలూరు రంగ నాయకులు, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా జనార్దన్‌రెడ్డి



కర్నూలు (న్యూటౌన్): తపాలా శాఖ కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా జి జనార్దన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ గోవా రీజన్‌లో తపాలా శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై కర్నూలు పోస్టల్ సూపరింటెండెంట్‌గా వచ్చినట్లు చెప్పారు. బహుళ ప్రయోజనాలు కలిగిన సేవలను తపాలా శాఖ ప్రజలకు వేగంగా, నమ్మకంగా అందిస్తోందన్నారు. దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్నవారికి సైతం ఎంతో నమ్మకంగా పార్సిళ్లను చేరవేస్తోందన్నారు. తపాలా శాఖ అందిస్తున్న సేవలను, పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్స్, ఫీల్డ్ ఆఫీసర్స్‌గా కర్నూలు డివిజన్‌లో కమిషన్ పద్ధతిలో పని చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జి జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొండారెడ్డి బురుజు దగ్గర తపాలా శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7013029312 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



రమణమ్మ (ఫైల్)

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రమణమ్మ(67)కు ఇద్దరు కుమారులు, అయితే వారు కొంతకాలంగా ఆమెను సరిగా పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కుమారులు రెండు రోజులుగా గాలించగా శుక్రవారం గ్రామంలోని శ్మశానం వద్దనున్న బావిలో శవమై తేలింది. వారు పోలీసుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ వెంకటరమణ తెలిపారు.

పిడుగుపడి 68 జీవాలు మృతి



పిడుగుపాటుకు గురై మృతి చెందిన జీవాలు

బనగానపల్లె రూరల్: వితలాపురం గ్రామ సమీపంలో పిడుగుపడి 68 జీవాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జీవాల యజమానులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్లకు చెందిన సుధాకర్, చంద్రలకు చెందిన జీవాల మంద వితలాపురం గ్రామ సమీపంలో మేతకోసం గురువారం వెళ్లారు. అయితే రాత్రి ఆకస్మికంగా గాలివాన రావడంతో పొలంలో ఉన్న వేప చెట్టు కిందకు జీవాల మంద చేరాయి. అదే సమయంలో భారీ శబ్దం తో చెట్టుపై పిడుగుపడింది. దీంతో చెట్టు కింద ఉన్న 68 జీవాలు షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందగా మరో మూడు జీవాలు అపస్మారక స్థితిలో ఉన్నాయి. టంగుటూరు పశువైద్యులు డాక్టర్ చిన్నబాబు మృతి చెందిన జీవాలను పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన జీవాల విలువ మార్కెట్ రేటు ప్రకారం సుమారు రూ.7 లక్షలకుపైగా ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని జీవాల బాధితులు కోరారు.

భారీగా తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం బాక్స్‌లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొత్తపల్లి: తెలంగాణ నుంచి కృష్ణానది మీదుగా నాటు తెప్పలపై అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గురువారం సిద్ధేశ్వరం సమీపంలో తెలంగాణ నుంచి కృష్ణానదిలో రెండుపుట్టిల్లో మద్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆత్మకూరు సీఐ నాగభూషన్‌తో కలసి దాడులు చేసి 3,360 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా పోలీసుల రాకను గమనించిన నిందితులు అక్కడి నుంచి మద్యం సీసాలు అక్కడే వదిలేసి పరారయ్యారని, వారికోసం గాలిస్తున్నామన్నారు. తెప్పలను మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసుకున్నామని వివరించారు. అదేవిధంగా ముసలిమడుగు గ్రామానికి చెందిన హుసేన్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 370 మద్యం సీసాలు తరలిస్తుండగా సంగమేశ్వరం సమీపంలో దాడిచేసి పట్టుకున్నామన్నారు. అతనిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములకు నిరంతర విద్యుత్

● విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో 10 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, 30 మంది డీఈఈలు, 74 మంది ఏడీఈ/ఏఈలు, 77 మంది జూనియర్ ఇంజినీర్లు, 1,396 ఇతర సిబ్బంది మొత్తం 1,587 మంది విద్యుత్ ఉద్యోగులు విధుల్లో ఉంటారన్నారు. కర్నూలు జిల్లాలోని 2,186 కేంద్రాలు, నంద్యాల జిల్లాలోని 1,621 పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా విద్యుత్ సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాలతో పాటు కర్నూలు జిల్లా ఈవీఎంలను భద్రపరిచే రాయలసీమ యూనివర్సిటీలో మూడు స్ట్రాంగ్ రూములకు, నంద్యాల జిల్లా ఈవీఎంలను భద్రపరిచే శాంతిరామ్, ఆర్‌జీఎం కళాశాలల్లోని స్ట్రాంగ్ రూములకు నిరంతర విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రుద్రమూర్తికి రేపు అభిషేక పూజలు


రుద్రపార్క్‌లో ప్రతిష్టించిన రుద్రుని విగ్రహం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని రుద్రా పార్కులో ఈనెల 12న రుద్రమూర్తికి ప్రత్యేక అభిషేకాది అర్చనలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. గతంలో శంకర జయంతి రోజున ఈ రుద్రమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా అదే రోజున పంచామృతాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుద్రుని చల్లని కృప ఎల్లప్పుడు కృష్ణా నదిపై పడడం వలన జలాశయం జలకళతో నిండి ఆనకట్ట రుద్రుని కటాక్షం చేత రక్షించబడుతుందని ఆధ్యాత్మికవేత్తలు పేర్కొన్నారు. దీంతో ఆలయ ఈశాన్య భాగంలో కృష్ణా నదికి అభిముఖంగా (రుద్రుని దృష్టి కృష్ణా నదిపై పడే విధంగా) రుద్రుని విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు వివరించారు.

శంకర జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీశైలానికి 4 కి.మీ దూరంలో పాలధార – పంచధార వద్ద ఉన్న ఆదిశంకరా సమేత శారదా దేవి ఆలయంలో ఈ నెల 12న వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా ఉదయం 9:30 గంటలకు ఆదిశంకరుల జయంతోత్సవం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా చంద్రమౌళీశ్వర స్వామికి, శారదా దేవీకి, శంకరుల వారికి జలాభిషేకం, బిల్వపత్రిపూజ, నీరాజన మంత్ర పుష్పాలు, అర్చనలు జరిపిస్తున్నట్లు తెలిపారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

● ఐదుగురికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): హైవే 44పై వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు పెట్రోల్ బంక్ ఎదుట శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెంగళూరుకు చెందిన ఐదుగురు గాయపడ్డారు. బెంగళూరు జేసీ నగర్‌కు చెందిన అరవ్, శోభ దంపతులు తమ కుమారులు సుజయ్, అజయ్, రక్షిత్‌లతో కలిసి శ్రీశైలానికి కారులో బయలుదేరారు. ఘటనాస్థలంలో ఎదురుగా వెళ్తున్న హర్యాణాకు చెందిన కంటైనర్ లారీ కుడివేపు లేన్ నుంచి అకస్మాత్తుగా ఎడమవైపునకు తిరగడంతో ఆ లేన్ గుండా వెళ్లాల్సిన కారు కంటైనర్‌ను ఢీకొంది. ప్రమాదంలో కారులోని దంపతులు తీవ్రంగా గాయపడగా ముగ్గురు కుమారులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే పోలీసులు అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

అక్రమ వసూళ్లు వద్దన్నందుకు..

● పార్టీ మారిన మున్సిపల్ మాజీ పాలకవర్గ సభ్యులు

డోన్: అతను మున్సిపల్ పాలకవర్గం మాజీ సభ్యుడు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడినని చెప్పుకుంటూ డోన్ రైల్వే డబ్లింగ్ పనుల్లో ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పి రూ.16 లక్షలు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని బేతంచెర్ల రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను నంద్యాల రైల్వే లైన్ డబ్లింగ్ పనులు జరుగుతున్నందువల్ల రైల్వే అధికారులు ఇటీవల కూల్చివేశారు. ప్రతి ఇంట్లో రేషన్‌కార్డు హోల్డర్‌కు రూ.14 లక్షలు, మేజర్లు ఉంటే అదనంగా మరో రూ.14 లక్షలను ప్యాకేజీగా రైల్వే శాఖ అధికారులు రెవెన్యూ అధికారుల ద్వారా బాధితులకు అందజేశారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన మున్సిపల్ పాలకవర్గ మాజీ సభ్యుడు ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున 56 మంది నుంచి రూ.16 లక్షలను అక్రమంగా వసూలు చేసి జేబు నింపుకున్నాడు. అధికార పార్టీలో ఉండి సామాన్య ప్రజలకు సేవ చేయాల్సింది పోయి అక్రమ వసూళ్లకు పాల్పడటంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన ఇదే అదనుగా భావించి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిపోయారు. తన బండారం బయట పడటంతో వైఎస్సార్‌సీపీలో ఇమడలేక స్థానిక నాయకులకు ముఖం చూపలేకే అతడు పార్టీ మారినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ఇలాంటి వారిని టీడీపీలో చేర్చుకోవడం అవినీతి, అక్రమార్కులకు లైసెన్స్ ఇవ్వడమేనని స్థానికులు అంటున్నారు.

దొంగ ఓట్లు డబ్బు మూటలు



● కర్నూలులో బరితెగించిన టీడీపీ
● దొంగ ఓట్లు వేసేందుకు బీహార్, ఒడిశా కూలీలు
● రైల్వే ట్రాక్ సమీపంలో వారికి విడిది
● ఫ్యాక్టరీ కాంట్రాక్టర్ల చేతిలో దొంగ ఓటర్ స్లిప్పులు
● సొంత ఉద్యోగుల ద్వారా డబ్బుల పంపిణీ
● అసంతృప్తితో వ్యతిరేకించిన పార్టీ శ్రేణులు
● తన విధానాన్ని మార్చుకోనని తేల్చి చెప్పిన అభ్యర్థి

కర్నూలు: కర్నూలులో టీడీపీ తరపున బరిలో నిలిచిన అభ్యర్థి బరితెగించాడు. ప్రజల నుంచి మద్దతు లేదని గ్రహించిన తండ్రీ, కొడుకు అడ్డదారుల్లోనైనా గెలవాలనే లక్ష్యంతో ఓటర్లను వివిధ రూపాల్లో ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడమనే విధంగా వార్డుల్లో చోటామోటా నాయకులకు, ఓటర్లకు సంకేతాలు పంపుతున్నారు. ఎన్ని ఎత్తులు వేసినా విజయంపై భరోసా కలగకపోవడంతో అంతిమంగా దొంగ ఓట్లను నమ్ముకున్నారు. బీహార్, ఒడిశా ప్రాంతాలకు చెందిన వారితో పాటు పరిశ్రమ పరిసర గ్రామాలైన గొందిపర్ల, దేవమడ, ఇ.తాండ్రపాడు, బసాపురం, కాశాపురం, బైరాపురం, అలంపూరు తదితర శివారు గ్రామాలకు చెందినవారు వారు పరిశ్రమల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆయా ఫ్యాక్టరీల్లో పని చేసే ఉద్యోగులు ఎక్కువ మంది కర్నూలులో నివాసముంటున్నారు. పరిశ్రమలో కాంట్రాక్టర్ల కింద పని చేసే బీహార్, ఒడిశా కార్మికులకు స్థానిక ఉద్యోగుల ఇళ్ల కరెంటు బిల్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్ ఆధారంగా సుమారు 10 వేలకు పైగా దొంగ ఓట్లను చేర్పించారు. గతంలో చేర్పించిన దొంగ ఓట్లు తొలగిపోవడంతో ప్రస్తుతం ఎన్నికల విధుల్లో కీలకపాత్ర వహిస్తున్న ఓ అధికారి ద్వారా మళ్లీ దొంగ ఓట్లను చేర్పించారు. బీహార్, ఒడిశా కూలీలు ప్రస్తుతం రైల్వే ట్రాక్ సమీపంలోని క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. పోలింగ్ రోజు వారిని కొన్ని ప్రాంతాలకు తరలించి దొంగ ఓట్లు వేయించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు అభ్యర్థి అనుచరులు చర్చించుకుంటున్నారు.

వార్డులకు చేరిన డబ్బు సంచులు

కర్నూలు ప్రజల నుంచి చీత్కారాలు ఎదుర్కొన్న తండ్రీ, కొడుకు ఈ ఎన్నికల్లోనైనా విజయం సాధించాలని డబ్బు పంపిణీ ఘట్టానికి తెర లేపారు. గత ఎన్నికల్లో ఏ వార్డు నుంచి ఎన్ని ఓట్లు తనకు అనుకూలంగా కొనుగోలు చేశామనే లెక్కలతో పాటు తాజాగా ఎన్ని ఓట్లు వస్తే విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందనే అంశాలపై తండ్రీ, తనయుడు చర్చించుకుని ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు డబ్బులు పంచుతున్నారు. వార్డుల్లో ఉన్న కార్పొరేటర్లు, ద్వితీయ శ్రేణి నాయకులను పక్కన పెట్టి నేరుగా తన కంపెనీలో పనిచేసే ఉద్యోగుల ద్వారానే డబ్బులు పంపిణీ చేస్తున్నారు. దీంతో కొన్ని వార్డుల్లో పార్టీ శ్రేణులు వ్యతిరేకించడం, అలక వహించడంతో నా విధానాన్ని మార్చుకోను.. ఉంటే ఉండండి... లేకపోతే మీ ఇష్టం.. అంటూ సమావేశంలో తేల్చి చెప్పినట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలురెవరు, తటస్థులు ఎవరని గుర్తించిన డేటా ఆధారంగా డబ్బు పంపకాలు జరుగుతున్నాయి.

సందిగ్ధంలో పడేసే కుట్ర

నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న సామాజికవర్గాల ఓట్లను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. ఆ సామాజిక వర్గాల్లోని కీలకమైన పెద్దలంతా తనతోనే ఉన్నారని, మీరు కూడా కలసి రావాలని ప్రలోభపెడుతున్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేసి ప్రత్యర్థికి చెందిన ఓటర్లను సందిగ్ధంలో పడేసి లబ్ధి పొందాలని కుట్ర చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కర్నూలులో అభ్యర్థికి పరిశ్రమలతో పాటు స్టార్ హోటల్, హాస్పిటల్, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అందులో పనిచేసేవారికి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆన్‌లైన్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు ఇప్పటికే జమ చేసినట్లు కంపెనీ ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ఓటుకు రూ.1,500

తన ఉద్యోగుల ద్వారా ఓటరు స్లిప్పుతో పాటు డబ్బులు కూడా పంపిణీ చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో ఓటుకు రూ.1,500, మరికొన్ని వార్డుల్లో రూ.వెయ్యి చొప్పున ఇస్తున్నారు. తనకు అనుకూలంగా లేని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అదనంగా ఇస్తున్నారు. వార్డుల వారీగా పరిశ్రమ ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే సగం వార్డుల్లో పంపిణీ జరిగిందని ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. ఓటర్ల స్లిప్పులు అనుచరుల ద్వారా వారం రోజులుగా పంపిణీ చేశారు. వాటిని చూపితే రూ.1,500 ఇళ్ల వద్దనే ఇస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,74,465 మంది ఓటర్లు ఉన్నారు. అందులో సగం మంది ఓటర్లకు నగదు ఇచ్చేలా ఏర్పాట్లు చేసి నమ్మకమైన వ్యక్తుల ఇళ్లలో నగదును దాచి పంపిణీ చేస్తున్నారు. నగదు తరలింపునకు కూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని మూడు రోజులుగా వార్డుల్లోని సామాజిక నేతల ఇళ్లకు చేర్చినట్లు సమాచారం. ప్రజలకు రక్షణ కల్పించే శాఖలోని కొందరు అధికారులకు సమాచారం తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాతబస్తీలోని ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో అభ్యర్థి సామాజిక వర్గం నేత ఒకరు నివాసముంటున్నారు. అక్కడ ఓటర్లకు డబ్బు పంపిణీ కార్యక్రమం జోరుగా సాగుతోంది. వారం క్రితమే పంపిణీ చేసిన స్లిప్పులు చూపిన వారికి డబ్బు ఇచ్చి పంపుతున్నట్లు ఆ కాలనీ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చాలి

● ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు మీర్ తారిఖ్ అలీ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక పరిశీలకులు మీర్ తారిఖ్ అలీ

ఆలూరు: ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని ఎన్నికల పరిశీలన ప్రత్యేక అధికారి మీర్ తారిఖ్ అలీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాల్లో 2,53,927 ఓటర్లు ఉన్నారన్నారు. ఈనెల 13న పోలింగ్ ఉన్నందున పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను జాగ్రత్తగా తరలించాలన్నారు. 12వ తేదీ రాత్రికే ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అనంతరం మెయిన్ పాఠశాల, ఆది ఆంధ్ర పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి రామునాయక్, తహసీల్దార్ చంద్రశేఖరయ్య, డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎలెక్షన్ డీటీ గుండాలనాయక్ తదితరులు ఉన్నారు.

బీసీకి బంధువర్గం దూరం

● సొంత గ్రామంలోనే బీసీకి షాక్
● టీడీపీని వీడిన బీసీ మధుసూదన్‌రెడ్డితో పాటు వంద కుటుంబాలు
● కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యనకండ్లకు చెందిన టీడీపీ మద్దతుదారులు

బనగానపల్లె రూరల్: టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సొంత గ్రామమైన బనగానపల్లె మండలం యనకండ్లలో ఆయన దాయది బీసీ మధుసూదన్‌రెడ్డితో పాటు మరో వంద కుటుంబాలు టీడీపీ వీడారు. వారంతా శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బీసీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గొల్లప్రసాద్, బొబ్బల తిమ్మారెడ్డి, బొబ్బల మద్దిలేటిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సంజీవగౌడ్, గొల్ల బాలరాజు, బోయ లక్ష్మన్న, బలిజ శ్రీనివాసులు, వడ్డె నాగసుబ్బయ్య, వడ్డె రామకృష్ణ, గొల్ల వుశేని, బోయ శివ, శ్రీనాథ్‌రెడ్డి, గొల్ల రామకృష్ణ, హనుమంతు, ఎరుకలి హుస్సేని, హుస్సేన్‌సా, మాసుం, సుధాకర్, రమణ, నల్లారెడ్డి, బొల్లిరాజు, బలిజ వెంకటేశ్వర్లు, చిన్న మద్దిలేటి, సుబ్రమణ్యం, బోయ నాయుడు, సుధాకర్‌రెడ్డి, వడ్డె సుధాకర్, గొల్ల సుబ్బారావు, కుమార్‌రావులతో పాటు మొత్తం వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసీపీ కండువావేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీలో పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సొంత బంధువులే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఇటీవలనే ఈ గ్రామం నుంచి సుమారు 400 కుటుంబాల వరకు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయాన్ని కూడా ఎమ్మెల్యే గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, నొస్సం సాంబశివారెడ్డి, బీసీ మహేశ్వరరెడ్డి, వడ్డె సుబ్బరాయుడు, పాపసాని గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌పై నిశిత పరిశీలన


మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ జాఫర్

కర్నూలు(సెంట్రల్): ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన పెంచుకొని పోలింగ్ రోజున నిశిత పరిశీలన చేయాలని జనరల్ అబ్జర్వర్ జాఫర్ మైక్రోఅబ్జర్వర్లకు సూచించారు. శుక్రవారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్లకు రెండో విడత శిక్షణ ఇచ్చారు. జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ.. ఈవీఎంల పనితీరుపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాలెట్, కంట్రోల్, వీవీ ప్యాట్ల కనెక్ట్, డిస్ కనెక్ట్ విధానాన్ని వివరించారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి ప్రక్రియను నిశితంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అబ్జర్వర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ఎవరి పనిని వారు బాధ్యతగా నిర్వర్తిస్తే ఎన్నికలు సజావుగా జరుగుతాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, భద్రత పరమైన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదికలు రూపొందించాలన్నారు. అనంతరం శిక్షణ కొనసాగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

సంతోషం.. అంతులేని విషాదం

● భార్య మగబిడ్డను ప్రసవించడంతో సంతోషం
● పెద్ద కుమారుడు బావిలో జారిపడి మృతి చెందడంతో విషాదం


లక్ష్మన్న (ఫైల్)

ఆదోని అర్బన్: భార్య మగపిల్లవాడిని ప్రసవించినట్లు బెంగళూరుకు వలసకు వెళ్లిన భర్తకు శుభవార్త వచ్చింది. దీంతో హుటాహుటిన శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగా ఆరేళ్ల పెద్ద కుమారుడు బావిలో జారిపడి మృతి చెందినట్లు తెలియడంతో ఆ తండ్రి దుఃఖసాగరంలో మునిగిపోయాడు. ఈ సంఘటన మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతెకూడ్లూరుకు చెందిన ఆదాము పెద్ద కుమారుడు లక్ష్మన్న (6) బసవ జయంతి సందర్భంగా బంధువులతో పాటు గ్రామంలోని ఆలయానికి వెళ్లాడు. తోటివారితో ఆడుకుంటూ ఇద్దరు బాలురు అక్కడున్న బావి వద్దకు వెళ్లారు. లక్ష్మన్న కాలు జారి బావిలో పడిపోయాడు. అతని వెంట వచ్చిన బాలుడు స్థానికులకు చెప్పడంతో వారు వచ్చి లక్ష్మన్నను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా నిండు గర్భిణిగా ఉన్న బాలుడి తల్లి శుక్రవారం గ్రామంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. బెంగళూరుకు వలస వెళ్లి పనులు చేసుకుంటున్న భర్త మొదట శుభవార్త తెలుసుకుని సంతోషంగా స్వగ్రామానికి తిరిగొచ్చాడు. గ్రామంలో అడుగుపెట్టగానే పెద్ద కుమారుడు మృతి చెందాడన్న వార్త తెలుసుకుని కుదేలయ్యాడు. ఆదాము దంపతులకు శుక్రవారం ప్రసవించిన బిడ్డతో కలిపి ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు లక్ష్మన్న మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.


హొళగుందలో ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం


భజనలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో బసవ జయంతి


ఎల్లార్తిలో నందికోలు వేడుకలో పాల్గొన్న భక్తులు

హొళగుంద: మండలంలో శుక్రవారం బసవ జయంతిని వీరశైవ లింగాయిత్, ఇతర వర్గాల వారు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బసవేశ్వరస్వామి చిత్రపటానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఇక్కడి ప్రజలు ఈ బసవ జయంతి పండుగను మంచి రోజుగా ఎంతో ప్రాధాన్యం ఇచ్చి శుభకార్యాలు కూడా నిర్వహిస్తారు. అదేవిధంగా ఎల్లార్తిలో కూడా నందికోలు ఉత్సవం మధ్య బసవేశ్వరుడి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

చెరువులో చేపలు మృతి

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో శీల బోయిన చెరువులో చేపలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బెస్త సంఘం సభ్యులు రెండేళ్ల క్రితం చేపల పిల్లలను తెచ్చి చెరువులో వదిలారు. గతేడాది చేప పిల్లల సైజు పెరగకపోవడంతో అలాగే వదిలేశారు. ఈ ఏడాది ఒక్కో చేప 2 కిలోల వరకు ఉండటంతో కొద్ది రోజుల తర్వాత పట్టి విక్రయించుకోవాలని భావించారు. అయితే రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో చెరువులోకి కొత్తనీరు వచ్చి చేరింది. ఒండ్రుతో కూడిన కొత్త నీటిని తాగి వేడికి ఊపిరి ఆడక చేపలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం ఉదయాన్నే చెరువు వైపు వెళ్లిన బెస్త సంఘం సభ్యులు చనిపోయిన చేపలను చూసి లబోదిబోమన్నారు. దాదాపు రూ.8లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. విషయాన్ని సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర, నాగేష్ బాలయ్య, సుబ్బారావు, శూలం ప్రభాకర్ తదితరులకు వివరించడంతో వారు వెళ్లి పరిశీలించారు. విషయాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి బంద్ కానున్నాయి. 13వ తేదీ పోలింగ్ ముగిసినట్లు అధికారికంగా ప్రకటించేవరకు మద్యం విక్రయాలు ఉండవు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో 82 మద్యం దుకాణాలు, 28 బార్లు, 3 టూరిజం బార్లు, ఒక క్లబ్ ఉన్నాయి. అన్నింటికీ తాళాలు వేసి సీల్‌లు వేసి అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత సీల్‌లను తొలగిస్తారు. బార్లలో కూడా మద్యం విక్రయాలకు అనుమతి లేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద సెక్యూరిటీ గార్డులతో పాటు అందులో పనిచేసే సిబ్బంది కాపలాగా ఉంటూ నిల్వ ఉన్న స్టాక్‌ను బయటకు వెళ్లకుండా చూసుకునే బాధ్యతను అప్పగించినట్లు ఆ శాఖ ఉన్నతాధికారి తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అభివృద్ధి కాంతులు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లెలతోపాటు పట్టణాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. సీసీరోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించింది. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఐదు గ్రామసచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 35 కోట్లతో ఆయా కాలనీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండటంతో రూ. 50 లక్షలతో కొత్తగా బస్టాండ్‌ను నిర్మించి ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ పనులను పూర్తి చేయడంతో పాటు పోలీస్‌సర్కిల్ కార్యాలయం, చౌడమ్మ గుడి సమీపంలో సీసీరోడ్లతో పాటు అండర్ డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలకు మురుగు కష్టాలు తొలగిపోయాయి.

– కోవెలకుంట్ల




ముదిగేడు చౌరస్తా నుంచి పంచాయతీ కార్యాలయం వరకు డివైడర్‌తో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌తో కొత్త కాంతులు వెదజల్లుతున్న దృశ్యం

ఐదేళ్లలో కోవెలకుంట్లలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు టర్నింగ్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డులో రూ. 8 కోట్లతో సీసీరోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు
- పట్టణంలో రూ 6.82 కోట్లతో నాడు– నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు
- రూ. 3.65 కోట్లతో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం
- జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 1.80 కోట్లతో తాగునీటి వసతి
- రూ. 1.60 కోట్లతో నాలుగు సచివాలయాల భవన నిర్మాణాలు
- రూ. 1.20 కోట్లతో ముస్లిం మైనార్టీల కమ్యూనిటీ భవన నిర్మాణం
- రూ. 1.60 కోట్లతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు
- చౌడమ్మ దేవాలయం సమీపంలో రూ.1.10 కోట్లతో సీసీరోడ్డు, డ్రైనేజీ కల్వర్టుల నిర్మాణం
- గాంధీనగర్‌లో రూ. 84 లక్షలతో సువిశాలమైన సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు
- రూ. 50 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు
- రూ. 42 లక్షలతో ముదిగేడు చౌరస్తా నుంచి వైఎస్సార్ విగ్రహ వరకు తాగునీటి పైప్‌లైన్ పనులు
- రూ. 32 లక్షలతో గాంధీనగర్‌లో వాటర్‌ప్లాంట్ ప్రాంతంలో సీసీరోడ్డు, డ్రెయినేజీ


రూ. 16 లక్షల నాడు- నేడు నిధులతో అన్ని హంగులతో ప్రాథమిక పాఠశాల


గుంజలపాడు రహదారిలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ

- రూ. 82 లక్షలతో పోలీస్‌సర్కిల్ కార్యాలయం నుంచి చమురు శ్రీను ఇంటి వరకు సీసీరోడ్డు, అండర్ డ్రెయినేజీ
- రూ. 65 లక్షలతో మూడు రైతు భరోసా కేంద్రాలకు నూతన భవనాల ఏర్పాటు
- రూ. 25 లక్షలతో రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం
- గుంజలపాడు రహదారిలో రూ. 21 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ
- వీరభద్ర సప్లయర్స్ ఎదురుగా ఉన్న వీధిలో రూ. 5 లక్షలతో డ్రెయినేజీ విస్తరణ సీసీరోడ్డు నిర్మాణం
- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రూ. 1.50 లక్షలతో డివైడర్ ఏర్పాటు